# పగిలిన గడియారం

శాంతమ్మచేయి ప్రమాదపూర్వకంగా తగిలి క్రిందపడిన గడియారం మూడు పల్టీలు కొట్టి నేలమీద తలక్రిందుగా ఒరిగిపోయింది. శాంతమ్మ ఆ గడియారం క్రిందపడిన కంగారులోంచి తేరుకుని చూసేసరికి ఆ గడియారం తాలూకు అద్దం ముక్కలై కనిపించటమే కాకుండా గడియారంలోని జీవం బొందిని విడిచి వెళ్ళిపోయినట్లు నమ్మకం తోచింది.

శాంతమ్మ అ గడియూరాన్ని ప్రేమపూర్వకంగా చేతిలోకి తీసుకుంది.అందమైన దానిముఖం నానా వికృతంగా తయారయింది. దానిగుండె ఆగిపోవటం యిందాకెప్పుడో జరిగిన విషయం. దాని చలనానికి ఆయువుపట్టయిన స్ప్రింగు శాంతమ్మ భాషలో విరిగిపోయిందో, చెడిపోయిందో, వూహకందకుండాపోయిందో —శాంతమ్మ వూహకందని విషయం.

ఏది ఏమయినా దానికి తిరికి బాగుపడే గీత లేదని శాంతమ్మ నిర్ణయించుకుంది. అథవా బాగుపడినా అ గడియూరం ఖరీదుకు ఒకటో రెండో ఎక్కువ పెడితేగాని దారికి రాదని అమె నమ్మకం. రెండేళ్లు వాడిన గడియూరానికి తిరిగి అంతడబ్బు పెట్టి రిపేరు చేయించటమెందుకూ—అని ఆమె వితండవాదం. గడియారమంటే గోడకు తగిలించే దెయ్యమంటిదీకాదు.

జేబులో వేసుకునేదీ, చేతికి తగిలించుకునేదీ అయినటువంటి లొడుతడు బుడంకాయా కాదు. రేడియో బల్లమీద చక్కగా తీర్చుదిద్ది నట్లుండే అలారం టైంపీసు.

పగిలిపోయిన ఆ గడియారాన్ని గురించి మనసులో ప్రశంసించుకో లేకుండా వుండలేకపోయింది శాంతమ్మ. రెండేళ్లు చెక్కు చెదరకుండా, టిక్ టిక్ శబ్దం మానకుండా పనిచేసిన దివ్య యంత్రమది.

ఆ యింట్లో అది అందరికీ అభిమానమే. కాని, అందరికన్నా అభిమానం శాంతమ్మభర్తా, కాంతమ్మతండ్రీ,శాంతయ్య మామా అయిన కాంతయ్యకు వుంది.

కాంతయ్య యించుమించు రెండేళ్ళక్రితం మద్రాసుకు పనిమీద పోయినప్పుడు దానిని పట్టుకువచ్చాడు. ఏ నిమిషంలో అయితే అతడు దాన్ని కొన్నాడో ఆ నిమిషంనుంచీ అతని కది ప్రాణ ప్రదమై పోయింది. దాన్నిచక్కగా రేడియోబల్లమీద అమర్చి అనందపరవశుడై పోయాడు.

ఇంటి కెవరయినా వస్తే దాన్నిగురించి పొగడందే వదిలేవాడు కాదు. దానినిగురించి ఆయన చెప్పే ప్రశంసలుకూడా విచిత్రంగా వుండేవి.

అది కొన్న రెండేళ్ళలో ఒక్క నిమిషం, ఒక్క సెకనయినా ముందుకువెనక్కి నడిచి ఎరుగదుట.

అది అలారం కొడుతూంటే నిద్రపోతున్నవాడికి మెలకువ వచ్చే మాట అటుంచి, మెలకువగా ఉన్నవాడికి అమాంతంగా నిద్ర ముంచుక వచ్చేస్తుందట.

దాన్ని గుండె కొట్టుకునే శబ్దాన్ని దేంతో పోల్చాలో తెలీక తనగుండె చప్పుడుతో పోల్చేసుకున్నాడు.

అంతెందుకూ, దానిప్రాణం తన ప్రాణంతో సమానమట.

ఈ విధంగా చెప్పుకుని తను సంతోషించటమేగాక ఎదుటివార్ని కూడా సంతోషించమనేవాడు కాంతయ్య. ఒకవేళ సంతోషించటం సంభవించకపోతే సంతోషించేదాకా, కనీసం సంతోషించినట్లు నటించేదాకా వదిలేవాడూకాదు.

కాగా పోగా యివన్నీ శాంతమ్మ స్మృతిపథంలో మెరిసి గిలిగింతలుపెట్టి, అది చివరకు కలగా మిగిలింది గదా అని విచారంతో ముంచి లేవనెత్తాయి.

గడియారం పగలటం అటుంచి, దాన్నిగురించి సానుభూతి చూపటం యిటుంచి యింకో ప్రశ్న యక్ష ప్రశ్నలాగ ఎదురయింది. "భర్తకు సమాధానం చెప్పటం ఎలాగా?"

కాంతయ్య చండశాసనుడు. ఆ విషయంలో అతనికే అనుమానం లేదు.కోపం వచ్చిందీ అంటే తగ్గేదాకా ఘోర చిత్రవధ సల్పుతాడు. అతని యినపచేతిలో శాంతమ్మ సుకుమార శరీరం ఎన్నిసార్లో కుమిలి కమిలిపోయినదినాలున్నాయి.

అందుకనే శాంతమ్మకు భయం. భర్తప్రాణానికి ప్రాణమైన ఆ గడియారం విషయంలో సరియైన సంజాయిషీ చెప్పుకోకపోతే ఆ గడియారం తాలూకు అద్దం ఎన్నిముక్కలు అయిందో, తన వీపు అన్నిముక్కలు కాకపోయినా కనీసం అన్ని తట్లు తేలటమన్నా తథ్యం.

అందుకే ఆలోచించింది.

ఆలోచన తట్టేవరకూ ఆలోచించింది.

పది పదిహేను ఆలోచన్లు విఘ్నమయి, భగ్నమయాక అల్లుడు శాంతయ్య లోపలికి ప్రవేశిస్తూ వుండటమూ, కాంతమ్మ అతనికెదురేగి గదిలోకి తీసుకెళ్ళటమూ జరిగాయి.

శాంతయ్య కొత్తల్లుడు.

అత్తగారింటికి రావటం ఇది రెండోసారి.

కాంతయ్యకి అల్లుడంటే ఎంతో ప్రేమ. ప్రత్యక్షంలోగాని పరోక్షంలోగాని అతన్ని ఒకమాట అని ఎరుగడు.

అల్లుడిని చూడంగానే ఒక ఉపాయం మెరుపు మెరిసినట్లుగా తట్టింది శాంతమ్మకు.

అవును. బలే ఉపాయం. తనకు చీవాట్లు తప్పుతాయి. దేముడు మేలుచేస్తే దెబ్బలు తప్పుతాయి. ధైర్యం వహించింది. గాజు పెంకులన్నీ ఏరి పోగుపెట్టి, భర్తకోసం ఎదురుచూపులు చూసింది.

బారెడు పొద్దు వచ్చింతర్వాత కాంతయ్య యింటికి వచ్చాడు ఉసూరుమంటూ. ఈలోపల శాంతమ్మ తన ఉపాయం కూతురికి చెప్పి ఆమె సహకారంకూడా తీసుకుంది.

కాంతయ్య వచ్చీరాంగానే టైమ్ చూసుకున్నాడు. ఏది టైమ్! ఎక్కడుంది గడియారం? అతని కళ్ళల్లో కాంతి ప్రజ్వలించింది. కోపంతో బుసలు కొట్టాడు. తాపంతో రుసరుసలాడాడు. "ఎయ్ యిటురా" భార్యను కేకలేశాడు. వచ్చీరాగానే అడిగేశాడు.

"ఏదీ గడియారం?"

శాంతమ్మ తొణకలేదు. "చెబుతాను కూచోండి" అన్నది మామూలుగానే.

"ముందు చెప్పమంటూంటే? ఎవడు తీశాడు దాన్ని? ఎందుకు తీశాడు? తీసి ఏంచేశాడు?" అని ప్రశ్నలవర్షం కురిపించేశాడు కాంతయ్య.

శాంతమ్మ కళ్ళలో భయం చూపెట్టింది. "ఉష్. అరవబోకండీ. అల్లుడు వింటే ఎవన్నా అనుకుంటాడు?" అన్నది తగ్గు స్థాయిలో.

"ఏ వనుకుంటాడు? అతనికీ యీవ్యవహారానికీ ఏంసంబంధం?"

ఇదప్పుడే ఒక పెద్ద వ్యవహారం అయిపోయినటు మాట్లాడుతున్నాడు కాంతయ్య.

"లేకేం? ఉంది. కావలసినంత."

కాంతయ్య యీసారి తగ్గాడు కొంచం."అయితే చెప్పుచప్పున" అంటూ వేగిర పెట్టాడు.

శాంతమ్మ తాపీగా చెప్పింది. "మరేం. యిందాక అతగాడు ఎందుకో యీగదిలోకి వచ్చాడు. వచ్చి గడియారాన్ని చూశాడు"

"చూసి?"

"చెబుతున్నాను వినండి. మనదసలే అందమైన గడియారం కదండీ దాన్ని చూస్తే ఎవరికయినా ముచ్చటేస్తుందాయె. అతనికి అలా అనిపించింది కాబోలు. దగ్గరకొచ్చి సవరించాడు."

కాంతయ్య కింతవరకూ బాగానేవుంది. పైగా అంతటి మనిషి అల్లుడు తన గడియారాన్ని చూసి ముచ్చటపడ్డాటంటే తనకే గర్వం.

"సవరించి?" అని అడిగాడు.

"మరేమో అప్పుడూ, పొరపాటునే పాపం అతని చెయ్యి దాన్ని తగిలింది కాబోలు. ఇంకేం క్రిందపడ్డింది."

కాంతయ్య గాలి బరువుగా పీల్చాడు. ముందుకు వంగి అడిగాడు —"పడి?"

"ఇంకేముంది పడి? ముక్కలయిపోయింది" అని శాంతమ్మ తేల్చేసి, మూలనున్న సొట్టపడిన గడియారాన్ని చూపించింది.

కాంతయ్య వణుకుతున్న చేత్తో దాన్ని తీసుకున్నాడు. నిమిరాడు. గుండెకు హత్తుకున్నాడు. "హరి భగవంతుడా!" అని నిట్టూర్చాడు.

శాంతమ్మ ముందుకు వంగింది. "మాటవరుసకయినా అతనితో అనేరు. అమర్యాద. నొచ్చుకుంటాడు."

"అవును. నాకామాత్రం తెలుసు. ఏమంటాను? అల్లుడు"— అంటూ దిగాలుగా వెనక్కి జారిగిలబడ్డాడు కాంతయ్య.